క్లుప్తంగా

వైభవంగా రుద్రాభిషేకం



అభిషేకం చేస్తున్న వేదపండితులు

చివ్వెంల : క్రోధినామ సంవత్సర పాల్గుణ మాస శివరాత్రి సందర్భంగా ఉండ్రుగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం మహన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వేదపండితులు బ్రహ్మశ్రీ మంత్రమూర్తి మనోహర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బండకవి క్రిష్ణమోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న సభ్యులు

భానుపురి : ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7 వరకు జిల్లా కేంద్రంలోని శ్రీవేదాంత భజన మందిరంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి నివాసంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డికి మందిర కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో మందిర అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వర రావు, కోశాధికారి సోమా అశోక్ తోపాటు కమిటీ సభ్యులు వాసా చంద్రశేఖర్, సోమ సుమన్ తదితరులు ఉన్నారు.

బోయలపల్లి రేఖకు సన్మానం



రేఖను సన్మానిస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా నియమితులై తొలిసారిగా శుక్రవారం తన స్వగ్రామం అడివెంలకు విచ్చేసిన రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ సర్పంచ్‌లు కొమ్మనబోయిన వెంకన్న, మడ్డి పద్మ, మేడబోయిన యాదయ్య, బండారి నాగరాజు, పేరెల్లి ఉప్పలయ్య, వజ్జ రవి, శివరాత్రి వీరయ్య, మడ్డి రాజశేఖర్ ఉన్నారు.

నేడు సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు

చివ్వెంల: సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి గూడూరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని, సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నామని పేర్కొన్నారు. న్యాయవాదులంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలల తనిఖీ



ఏఐ బోధనను పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలగిరి : తిరుమలగిరి, తొండ, నెల్లిబండ తండా ప్రాథమిక పాఠశాలలు, అనంతారం మోడల్ స్కూల్‌లో శుక్రవారం పాఠశాల విద్య పరిశీలకుడు, ఈడీ మధుసూదన్‌రెడ్డి, జిల్లా సెక్టోరియల్ జనార్దన్ తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్, జాలి ఫోనిక్స్, మధ్యాహ్న భోజనం పథకాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికలు, ఇతర రికార్డులను పరిశీలించారు. తొండ పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత బోధనను పరిశీలించారు. వారి వెంట ఎంఈఓ శాంతయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సేఫ్టీ, సెక్యూరిటీ బోర్డుల ఏర్పాటు



సీతారాంపురంలో రాయించిన బోర్డు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర సమయంలో అవసరమయ్యే వివిధ విభాగాల ఫోన్ నంబర్ల కోసం స్కూల్ సేఫ్టీ, సెక్యూరిటీ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా శాఖల సెల్ నంబర్లను పిల్లలు, ఉపాధ్యాయులకు కనిపించేలా ప్రతి పాఠశాల ఎదుట భవనానికి రాస్తున్నారు. పోలీస్, ఫైర్, అంబులెన్స్, హెల్త్ హెల్ప్‌లైన్, డిజాస్టర్ హెల్ప్‌లైన్, ఆల్ ఇన్ వన్ ఎమర్జెన్సీ, ఉమెన్స్ హెల్ప్‌లైన్, యాంటి కరప్షన్ తదితర నంబర్లను రాయిస్తున్నారు.

ముంచుకొస్తున్న గడువు

- ఆస్తిపన్ను చెల్లింపునకు మార్చి 31 ఆఖరు తేదీ
- తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో 64శాతం వసూళ్లు పూర్తి

తిరుమలగిరి : మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లకు ఇంకా రెండు రోజులే మిగిలి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడువు ఈనెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లతో పాటు అధికారులంతా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిరోజు ఇంటింటికీ తిరుగుతూ వసూళ్లు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగా వంద శాతం పన్నుల వసూళ్లు లక్ష్యంగా పని చేస్తున్నారు. ప్రజలకు పన్నుల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో 5,494 ఇళ్లు ఉండగా రూ.145.40 లక్షలు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రూ.94.49 లక్షలు వసూలు అయ్యాయి. ఇంకా రూ.50.91 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటివరకు 64.99 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. రెండు రోజుల్లో గడువు ముగుస్తుండటంతో అధికారులు, పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వన్ టైమ్ సెటిల్‌మెంట్..

ప్రభుత్వం మున్సిపాలిటీల్లో వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం అమలు చేస్తూ ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం మాఫీకి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు వడ్డీతో ఆస్తి పన్ను చెల్లించిన వారికి కూడా వడ్డీ మాఫీ అమలవుతుందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నులో సర్దుబాటు చేయడం జరుగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బకాయి పడినవారు పన్నులు చెల్లించి ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం ప్రకటించిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31వ తేదీ వరకు 90 శాతం వడ్డీ మాఫీ అందుబాటులో ఉంటుంది. గతంలో చెల్లించిన వారికి కూడా వడ్డీ మాఫీ అమలై వచ్చే ఏడాది పన్నులో సర్దుబాటు అవుతుంది.

– యాదగిరి, మున్సిపల్ కమిషనర్, తిరుమలగిరి

ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు

సూర్యాపేట : సువెన్ ఫార్మా కంపెనీ లిమిటెడ్ ఆవరణలో నిర్వహిస్తున్న 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. వారోత్సవాల ముగింపు సమావేశానికి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కేవీ శ్రీదేవి హాజరై మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో పనిచేయాలని సూచించారు. కంపెనీ యాజమాన్యం అందజేస్తున్న భద్రతా పరికరాలను ప్రతిఒక్కరూ ధరించి బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. పీవీ రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎం. రమేష్ బాబు, శేషగిరి, సుధాకర్, రాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీ శ్రీదేవి

ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం



సూర్యాపేటలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

సూర్యాపేట అర్బన్ : పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేసుకొని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై పోలీసులు దాడి చేసి అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకులు తెలిపారు. రైతులపై దాడులు, కేసులకు నిరసనగా శుక్రవారం పట్టణంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆమ్ ఆద్మీ ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు మండారి డేవిడ్ కుమార్, ములకలపల్లి రాములు, వరికుప్పల వెంకన్న, బూర వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, నాయకులు షేక్ నజీర్, గంట నాగయ్య, వేల్పుల వెంకన్న, కునుకుంట్ల సైదులు, ధనియాకుల శ్రీకాంత్, దాసరి శ్రీనివాస్, దేసోజు మధు, వీరబోయిన లింగయ్య, బోల్క పవన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో సుధా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ శాఖ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న సుధ కోఆపరేటివ్ బ్యాంక్ తిరుమలగిరిలో నూతన బ్రాంచిని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. బ్యాంకు పాలకవర్గం ప్రజలకు ఉత్తమ సేవలు అందించి అందరి మన్ననలు పొందాలని ఆశించారు. ఈ సందర్భంగా బ్యాంక్ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్, బ్యాంక్ చైర్మన్ మీలా మహాదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, భోనగిరి భాస్కర్, అనంతుల ప్రభాకర్, ఏపూరు శ్రవణ్ కుమార్, కక్కినేని చంద్రశేఖర్, మీలా సందీప్ సుజాత, బోర్డ్ నిర్వహణ సభ్యులు స్వామి వెంకటేశ్వర్లు, చెన్నకేశవ రావు, వెంపటి రమణ, గాలి శ్రీనివాస్ పాల్గొన్నారు.



తిరుమలగిరిలో సుధా కోఆపరేటివ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

బిల్లులు విడుదల చేయాలి

సూర్యాపేట: ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీయూఎస్ నాయకుడు తీకుళ్ల సాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

జాతరలో విక్రయాలకు వేలం

చివ్వెంల : పులితండాలో ఏప్రిల్ 10, 11వ తేదీల్లో శ్రీచాంపూలాల్ జాతర జరగనుంది. అయితే జాతరలో మిఠాయిలు, వరిపేలాల విక్రయాలకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. సూర్యాపేటకు చెందిన యాదా నాగరాజు రూ.71వేలకు వేలం దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రాజశేఖర్, ఎంపీఓ దయాకర్, పంచాయతీ కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నూతనకల్ : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ మురళీబాబు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలానికి 50శాతం సబ్సిడీపై మూడు రోటోవేటర్లు, విత్తనాలు విత్తు పరికరాలు (1), పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్ 5, బ్యాటరీ ఆపరేటెడ్ మందు పిచికారీ పంపులు 5 మంజూరయ్యాయని తెలిపారు. కావాల్సిన మహిళా రైతులు ఏఈఓలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గోర్‌బోలి భాషకు గుర్తింపు



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

తాళ్లగడ్డ : కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే గోర్‌బోలి భాషకు గుర్తింపు లభించిందని బంజారా నాయకులు అన్నారు. లంబాడీల గోర్‌బోలి భాషను రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ శుక్రవారం కొత్త బస్టాండ్ సమీపంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ధరావత్ వీరన్న నాయక్, మాజీ జెడ్పీటీసీ జాటోతు రాజేష్ నాయక్, బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం జిల్లా అధ్యకుడు పాతులోతు ధారాసింగ్, గిరిజన సంఘాల నాయకులు నాగు నాయక్, చత్రు నాయక్, వాసు నాయక్, డి.మంగ్యా నాయక్, అజయ్ నాయక్, జి.హుస్సేన్ నాయక్, వి.వెంకన్న నాయక్, తావుర్య నాయక్, అము నాయక్ పాల్గొన్నారు.

తెలుగు సంవత్సరాది క్యాలెండర్ ఆవిష్కరణ

సూర్యాపేట : సూర్యాపేట మండల పరిధి పిల్లలమర్రి ఎరకేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను దేవాలయ కమిటీ చైర్మన్ గవ్వ వెంకటకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాతల సహకారంతో ఆలయ అర్చకుడు మునగలేటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో శివాలయ ఫొటోలతో మొట్టమొదటిసారిగా నూతన ఉగాది సంవత్సర క్యాలెండర్ విడుదల చేశామన్నారు. క్యాలెండర్ రూపకల్పనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మొగిలి ఎల్లయ్య, భక్తులు కరుణశ్రీ, మంటిపల్లి వెంకన్న, జేరిపోతుల ప్రసాద్, అబ్బూరి వినోద్ బాబు, పర్వతం మదనాచారి, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దేవాలయ కమిటీ చైర్మన్ గవ్వ వెంకటకృష్ణారెడ్డి, తదితరులు

ఎల్‌ఆర్‌ఎస్ సర్వర్ డౌన్‌తో ఇబ్బందులు



కౌంటర్ల వద్ద బారులుదీరిన ప్లాట్ల యజమానులు

సూర్యాపేట టౌన్ : గతంలో రూ.వెయ్యి చెల్లించి లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)కు దరఖాస్తు చేసుకున్న యజమానులకు 25శాతం రాయితీతో ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ గడువు ఈనెలాఖరు వరకే ఉండడంతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు యజమానులు సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద బారులుదీరుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పలువురు ప్లాట్ల యజమానులు ఫీజు చెల్లించేందుకు రాగా సర్వర్ రాకపోవడంతో గంటల తరబడి వేచిచూశారు. ఈ క్రమంలో ఇబ్బందులకు గురైన కొందరు నిరాశతో వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే ఎల్‌ఆర్‌ఎస్‌పై సందేహాలు అడుగగా సిబ్బంది సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్లాట్ల యజమానులు అంటున్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు వినూత్న ప్రచారం

ఆత్మకూర్(ఎస్) : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మద్దిరాల మండలం గోరెంట్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ కోరారు. యువత డ్రగ్స్, మద్యానికి దూరంగా ఉండాలని కోరుతూ శుక్రవారం నెమ్మికల్ పశువుల సంతలో వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. పుర్రె, ఎముకల బొమ్మలు ఉన్న నల్లటి దుస్తులను ధరించి ఓ మైకుతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారు విచక్షణ కోల్పోయి సమాజానికి కీడు చేస్తున్నారని తెలిపారు. మద్యం, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను పలువురు అభినందించారు.



నెమ్మికల్లు సంతలో వినూత్న ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

ముస్లింలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం



భానుపురి : ఇఫ్తార్ విందులో పాల్గొన్న వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లింలు



నాగారం : ఫణిగిరిలో..



తిరుమలగిరి : ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

భానుపురి : కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తోందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మఫ్ ఫిరా మసీద్ వద్ద మాజీ కౌన్సిలర్ జహీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దురాజ్‌పల్లి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో ముస్లిం బాలికల కోసం అరబిక్ పాఠశాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ఇమామ్ ముఫ్తి అస్రార్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, బైరు శైలేందర్, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, గుణగంటి వంశీ, అయూబ్ ఖాన్, నాగుల వాసు, రావుల రాంబాబు, నర్సింగ్ మహేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ నాయక్, బత్తుల శ్రీను, సుధాకర్, లింగయ్య, రాకేష్, తరుణ్ పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరిలో ముస్లింలకు శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కాంగ్రెస్ నాయకుడు జంగిలి ఉపేందర్‌రావు మాట్లాడారు. రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ–ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయన్నారు. రంజాన్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాతి వీరమల్లుగౌడ్, కల్లెట్లపల్లి రాములు, పేరుమళ్ల జాన్‌వెస్లీ, గట్టు రవీందర్, వల్లాల భానుప్రసాద్, విద్యాసాగర్‌రెడ్డి, సోమిరెడ్డి, నాగు వెంకన్న, కల్లెట్లపల్లి సోమయ్య, దాసరి వెంకన్న, యాదగిరి, మామిడి భిక్షం, వెంకన్న, ముస్లింలు రఫీ, చాంద్, గోరేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కోశాధికారిగా నర్సిరెడ్డి



ఆత్మకూర్(ఎస్) : గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా ఆత్మకూరు(ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామానికి చెందిన సామ నర్సిరెడ్డి ఎన్నికయ్యారు. అలాగే సూరారపు లక్ష్మణ్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో గురువారం నిర్వహించిన ఐఎఫ్‌టీయూ అనుబంధ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ల విలీన సభలో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తుంగతుర్తి : తుంగతుర్తి మజీద్ ఏ నూర్ (మసీదు) నూతన కమిటీని శుక్రవారం ముస్లింలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎండీ జాన్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె. లాలు, కోశాధికారిగా ఎస్‌కె. అమీర్, జనరల్ సెక్రెటరీలుగా ఎస్‌కె. నజీర్, ఎండీ అబ్దుల్, జాయింట్ సెక్రెటరీగా కరీం, కమిటీ సభ్యులుగా ఎస్‌కె.అటల్‌పీరా, మన్సూర్ అలీ, యా కూబ్, సిద్ధిక్, అజీమ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మత గురువు మౌలానా అబ్దుల్ అహద్, ఉస్మాన్, భాష, ఆలీసాబ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యాలయం తనిఖీ

అర్వపల్లి : మండలంలోని అడివెంల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఎంపీడీఓ టి. గోపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కార్యదర్శికి సూచించారు. అలాగే వననర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుండగాని మహాలక్ష్మి, నర్సరి వాచర్ నస్రీన్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు కాటమయ్య కిట్ల పంపిణీ



కిట్ల పంపిణీలో పాల్గొని గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న బెల్లంకొండ వెంకటేశ్వర్లు

చివ్వెంల: తాటిచెట్లు ఎక్కి దిగే క్రమంలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ప్రభుత్వం ఇస్తున్న కాటమయ్య రక్ష కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కాటమయ్య రక్ష కిట్ రాష్ట్ర కోఆర్డినేటర్ బెల్లకొండ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామ శివారులోని కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కిట్లను ఎలా వినియోగించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డివిజన్ అధికారి గామయ్య, గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి మోగదాల లక్ష్మణ్ గౌడ్, ఎక్సైజ్‌కానిస్టేబుల్స్ వనజ, రమేష్, గీత కార్మికులు పబ్బు జానయ్య, కొండ వెంకన్న, జెర్రిపోతుల కృష్ణయ్య, గుణగంటి కృష్ణయ్య, నోముల వెంకన్న, కాశయ్య, మధు, పబ్బు నాగయ్య, చిరంజీవి, యల్లయ్య, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు అందజేత



నోట్‌పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు పాటు, మండల పరిధిలోని జ.తిర్మలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం సువెన్ ఫార్మా కంపెనీ సహకారంతో అక్షర ఫౌండేషన్ సభ్యులు నోట్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు ఉప్పు నాగయ్య, మాజీ సర్పంచ్ జూలకంటి సుధాకర్ రెడ్డి, హెచ్ఎంలు శ్రీనివాస్, అశోక్, అక్షర ఫౌండేషన్ కార్యదర్శి రుద్రంగి కాళిదాసు, సువెన్ ఫార్మా పీఆర్ఓ సైదులు, శ్రీనివాస్, మల్సూర్, యామా రమేష్, బలరాం నాయక్, వెంకటాచారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా ఇన్సూరెన్స్

నూతనకల్ : మండల కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులకు కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డుపల్లి అంజయ్య సొంత ఖర్చులతో ఇన్సూరెన్స్ చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 16మంది కార్మికులను మన గ్రోమోర్, ఐసీఐసీఐ ప్రమాద బీమా పథకంలో సభ్యులుగా చేర్పినట్లు తెలిపారు. రూ.2లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ పనులు

అర్వపల్లి : మండల పరిధిలోని అర్వపల్లి, అడివెంల, కుంచమర్తి తదితర గ్రామాల్లో శుక్రవారం గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కల సంరక్షణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి. గోపి పాల్గొని కమ్యూనిటీ, ఇతర ప్రదేశాల్లో మొక్కలకు నీళ్లు పోశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి, సిబ్బంది ఏడుకొండలు, సంధ్య, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలకు నీళ్లు పోస్తున్న ఎంపీడీఓ

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

తిరుమలగిరి : తిరుమలగిరి మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుమలగిరి మండల అధ్యక్షుడిగా సుంకరి సుధీర్, ఉపాధ్యక్షుడిగా పరశురాములు, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా సన్ని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగూరి యాదగిరి, జిల్లా కోశాధికారి లాలూ, కిష్టునాయక్, శ్రీరాములు, నారాయణ, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

బీపీ మండల్ వర్ధంతి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : బీహార్ మాజీ సీఎం, బీసీల పితామహుడు బీపీ మండల్ 13వ వర్ధంతిని ఏప్రిల్ 13న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త బింగి కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెంలో బీపీ మండల్ వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ రాజ్యాధికార సాధన సమితి సభ్యుడు బడుగుల నాగర్జునయాదవ్, జె. రాంప్రసాద్, మాదగాని సుదర్శన్, పెంటగాని రాజీవ్, ఎం.శేఖర్, బి.నాగరాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతో అభివృద్ధి

చిలుకూరు : రైతుల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బేతవోలు సహకార సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిలుకూరు మండల పరిధిలోని బేతవోలులో సహకార సంఘం ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో ఎరువులు అందిస్తున్నామని, రుణమాఫీ రూ.4.21 కోట్లు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సయ్యద్ పాషా, పాలకవర్గం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.